కథా నిలయం
54.53
శ్రీకాకుళం





# అశోకవృక్షం

ఆ పేట పేరు అశోక్‌నగర్. కొత్త భవనాలు రెండస్తులవీ, నాలుగూ అయిదూ అంతస్తులవీ లేచినయ్యి. అన్నీ మోడరన్ ఫ్లాట్స్. అమ్ముడుపోతూనే వున్నాయి. అపార్ట్‌మెంట్సుకి వింత వింత పేర్లు పెడుతున్నారు. ఒక అపార్ట్‌మెంట్ పేరు అశోకవృక్షం " ఆ అమ్మాయి పేరేమిటి?" అనడిగింది సుగుణ, యెదుటి ఫ్లాట్‌లో వున్న జానమ్మని. బోర్‌వెల్, లిఫ్టూ, వాహనాలు పెట్టుకునే సౌకర్యమూ అన్నీ వున్నాయి ఆ అపార్ట్‌మెంట్‌కి.

"సీత. అప్పుడే సీత నీ కంటబడిందీ? పనిబడితే వెళ్లావా, ఇవాళ బంద్. యేమైనా కావాలా?" జానమ్మ టీచర్. సాంఘిక శాస్త్రం నేర్పుతుంది గర్ల్స్ స్కూల్లో.

"పనిమనిషి కుదర్లేదింకా. అవస్థగా వున్నది. నాకీ నగరం కొత్త. తన మనిషిని పంపుతుందేమోనని వెళ్లి అడిగితే, "అది పనిమనిషికాదు. దాని తండ్రి క్రిస్టియానిటీ పుచ్చుకున్నాడు. డ్రై క్లీనింగ్ నేర్చుకుని బిజినెస్ పెట్టుకున్నాడు. జారి పడింది. కాలు బెణికిందని కూతుర్ని తెచ్చాడు. మా దుస్తులు తెచ్చి యిస్తాడు. నిమ్మ చెక్కకి తడిగుడ్డ చుట్టి వేడి నూనెలో ముంచుతూ కాపువేశా. తర్వాత నీరు సున్నం అద్దితే యెండి బిళ్లలుగా వూడుతుంది. తగ్గిపోయింది. పాలపాట్లాలు తెచ్చిస్తుంది. దాని భర్త సైకిల్ మీద ట్రేలల్లో తీసికెళ్లి పంచి వస్తాడు. చీకటితోనే వచ్చి పాలు యిచ్చి గిన్నెలు తోమి వెళ్తుందదంతే. వాళ్లిళ్లు చాలా దూరం. తిండిపెట్టి నయం చేశానని వస్తుంది. పనికి కుదరదు. కూరల అంగడి నడుపుతున్నది తల్లి. పనికిపంపదు" అన్నది. "కథ అల్లి చెప్పినట్టున్నారే? ఇంతకు ముందో అమ్మాయి చేసేదిట" అన్నాను. "అదా. దాని పేరు దుర్గి. పెళ్లయింది. ఆరిళ్లలో అలాగ్గా పనిచేసేది. వేవిళ్ల జ్వరం వచ్చి రాలేక పోయింది. ఇబ్బంది పడతామని అక్క కూతురు గౌరిని పంపింది. అదీ పనిమంతురాలే. కాని మొగుడు తాగి వచ్చి కొడితే చెయ్యి ఫ్రాక్చరట రాలేనని కబురు పెట్టింది పింతల్లి చేత. అదీ చీకటితో

వచ్చి ఒకపూటే గిన్నెలు తోమి పారిపోయేది. అయినా చూశారిరుగూ పొరుగూ. తిట్టటం మొదలెట్టారు. ''దాన్ని గుత్తకు తీసుకున్నావా? మరెవరికీ చేయద్దని యెక్కువ జీతమిస్తున్నావా? పని చేయించుకుని తరిమేస్తున్నావే? యేమిటి నీ స్పెషాలిటీ? ఊరికి ఉత్తరాన అత్తారు. నిన్ను రానీయరు. నీవే సెడ్యూస్ చేశావుట నీ బోయ్ ఫ్రెండ్ జానకీపతిని. పేరు మార్చుకోమన్నావుట? ఆ బోయ్ ఫ్రెండ్ మీదకి కేసు యెక్కింది. సస్పెండ్ చేశారు అధికారులు. పొడుచుకొచ్చి రాజీనామా యిచ్చి వచ్చాడట. అప్పుడే యిద్దరు పిల్లల్ని బైటికి లాగేశావే. మళ్లీ ప్రెగ్నెంటా? యేమంత తొందర?'' అలా నొవ్వనాడుతూనే రాత్రిళ్లు వచ్చి యిబ్బందులు యేకరువు పెట్టి అప్పుగానే యివ్వమని తీసికెళ్తారండీ'' అన్నది సీత.

'' ఒకామె మీ యింట్లోనించి వస్తూ కనబడింది? మేనత్తా? మీ వద్దే వుండి చేసి పెట్టచ్చుగా'' అనడిగాను.

''మేనత్తగాదు. ఈ వీధి చివర కొత్తగా వన్‌బెడ్‌రూమ్ భవనం లేచింది. దాని మొదటి అంతస్తులో వన్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొన్నాడు చివరికొడుకు. మేనగోడల్నిచ్చి పెళ్లి చేశారు''.

''మనమరాలికింట్లో కాలు నిలవదు. వెయ్యిళ్ల పూజారి మనమరాలు చంద్రి. యేదో నేర్పుతుందిట. గుడ్డలు కుట్టటం అదేదో కొత్త మెషీనొస్తున్నది చూడూ. అది వాడటం, వార్తలు చదువుతుందిట కాసేపు. వయసు మళ్లిన నా మీదన్నీ వదిలేసి పరుగు తీస్తుంది టైమైందంటూ. ఇంట్లో యేం నిండుకున్నా చెప్పగానే తేడు కొడుకు ''యీ పూట కప్పు తెచ్చుకో. రేపు తెస్తాలే షూటింగ్‌కి వెళ్లాలి. వేనొచ్చేసింది'' అని వెళ్లిపోతాడు కొడుకు.

''యేమిటి జాబ్?'' అనడిగాను.

మూతి తిప్పి తల తాటించి, మెటికలు విరిచి, ''కామరా మాన్‌కి అసిస్టెంటుట. అంటే యేమిటో తెలియదు. వెర్రెత్తిన అమ్మాయిలు చిన్న పాత్రలిప్పించమని వెంటబడుతారట. వాళ్ల సంగతీ చూస్తాడుట''.

''అంత తేలిగ్గా రాదే పాత్ర''

''పళ్లెం పట్టుకోటమో, బృంద నాట్యమో, వంపుసొంపులు చూపే డాన్సో యేదో ఒకటిప్పిస్తాడట''.

''డాన్సు రావద్దూ?''

''అక్కర్లా. వాళ్లే నేర్పిస్తారట. నేతి లోటా యియ్యవే కన్నా. ఈ చుట్టు పట్ల నిప్పు పుట్టదు, నీరూ పుట్టదు. ఇవాళ నీళ్లొదల్లేదు. మా భవనానికింకా గొట్టపు బావి పూర్తి కాలేదు. గొట్టా లేయాలి. డబ్బు కట్టాలిట వీధి కొళాయి కావాలంటే. పన్నెండు భాగాల వాళ్లకి నీళ్లు కావాలి. డబ్బేదీ? భాగం మట్టసంగా వున్నదని కొన్నాడు కొడుకు. అశోకవృక్షం కింద సీతాదేవిలాగా వున్నావే తల్లీ. పిలిచినా వెళ్లకు అత్తింటికి. వాళ్లు గండ్రాగొండి మనుషులు. నాకు తెలుసు అటువేపే వుండి యిటొచ్చేశాం. నేయి తీసుకు వెళ్తూ మీకు కనిపించింది'' జానమ్మ నవ్వుతూ హాస్యమాడింది. '' ఇంతకూ వెళ్లిన పనేమైందీ?''. ''తానే వచ్చి హెల్ప్ చేస్తానన్నది సీత. చిన్నప్పటినించీ, సాయపడటం అలవాటేట. సేవాభావం అలవడిందట ఆంటీ '' ఇప్పుడన్నీ మెషీన్లేగా. తప్పేమున్నది. పాత్రలన్నీ బుట్టలో వుండనీయండి. గుడ్డలు కుప్పగా వుంచండి. నేనొచ్చి డిష్‌వాషరుతో పాత్రలు శుభ్రం చేసి షెల్ఫులో వుంచుతా. గుడ్డలు మరో మెషీనుతో వాష్‌చేసి వరండాలో హేంగర్సుకి వేలాడ తీద్దాం. అమెరికాలో షాపులుంటాయట. గుడ్డలన్నీ సంచీలో వేసి తీసికెళ్లి, డ్రై క్లీనింగ్ చేసుకుని, అక్కడే యిస్త్రీ గూడా కానిచ్చి తెచ్చుకుంటారుట. డబ్బు చెల్లించటమే. నాలుగైదు మెషీన్లుంటాయట షాపులో. పనివారిని సప్లై చేసే ఆఫీసు మనకూ వచ్చింది. రెడీమేడ్ దుస్తులూ, వారం వారం జీతం తీసుకునేపనివాళ్లూ, రోజ్‌గార్ పనివాళ్లూ'' అని నవ్వింది సీత. ''పిల్లలో!'' అన్నా. ''నర్సరీ వున్నది. దింపి వస్తా. బేబీని చూసే పద్ధతీ వచ్చేసింది వర్కింగ్ వుమన్ కోసం. మనకు మోడరన్ కుక్స్ వస్తున్నారు. అన్నీ రెడీగా వుంచితే వంట చేసి వెళ్లిపోతారు. మనం సర్వ్ చేసుకోటమే. క్షిపణుల యుగంలో కొచ్చేశాం. స్పేస్ రీసెర్చ్, అటామిక్ రీసెర్చ్, సముద్రంలో పెట్రోల్ లభిస్తుందా అనే

పరిశోధనా, రంగురాళ్ల పరిశోధనా చేస్తున్నాము'' అని నవ్వించి పంపింది సీత.

## 2

డబ్బు చెల్లించి తన పేరు జానకీపతి అని నమోదు చేయించుకున్నాడు. కడుపులో బాధా గుండెల్లో గుబులూ పైకి రాకుండా దరహాస చంద్రికలు చూపుతాడు జానకీపతి.

డైనింగ్ టేబిల్ ముందు మౌనంగా వున్న జానకీపతిని సీత పలకరించింది. ''అలా వున్నారేం? ఇంటర్వ్యూ బాగాలేదా జాబ్ లభించలేదా? అదే దొరుకుతుంది. నేదొరకలా? అలాగే జాబూ. నే దొరికేదాకా ఓర్పుతో వెతుకుతూ వర్రీ కాకుండా వుంటిరే. మీ క్విష్టమైనవి చేశా. నింద తొలగలేదూ? దోషిపట్టుబడ్డాడా? బ్యాంక్ యేజెంట్ ఫోన్ చేయలేదూ? మంచివాడంటిరే. రిజైన్ చేయాల్సింది గాదు. తొందర పడ్డారేమో. ఆత్మాభిమానం దెబ్బతిన్నదేమో. పోయిన డబ్బేమో చెల్లించేవారు. తినండి''.

జానకీపతి స్పూన్‌తో తింటూ అన్నాడు ''మనం యీ అశోక్‌నగర్ నించి మారి మరోపేట కెళ్దాం. ఈ ఫ్లాట్ సెంటర్లో వుండి కన్వీనియంట్‌గా వున్నదని మారాము. మొదట నిందా, తర్వాత జాబ్ వదలటం. మరోటి లభించలేదు. ఇది చాలక విశాల అనే నా కొలీగ్ నా వెంట పడటం. మెంటల్ డిసీజ్ ఎటాక్ అయిందేమో సైక్రియాట్రిస్ట్‌ని కన్సల్టు చేయి అని చెప్పాను'', అన్నాడు జానకీపతి.

సీత సాంబారు గిన్నె జరిపింది. చింతచిగురు పప్పు రెండోసారి స్పూన్‌తో సర్వ్ చేసింది. ''యేమంటుందేం?''

''నవ్వాలో యేడవాలో తేల్చుకోలేక పోతున్నా సీతా. జాబ్ చేయలేకపోతున్నదట. పై అధికారీ, కొలీగ్స్ తనను పట్టి లొంగదీయాలని చూస్తున్నారట. తను నాకు గళ్ ఫ్రెండ్ గా వుంటుందిట. నిన్ను చూస్తున్నంత దయగా చూడాలిట. మనీ యివ్వాలిట. తనవారిని వదిలి వేరే వుంటుందిట. వాళ్లు తనను జలగల్లా పట్టి రక్తమంతా పీలుస్తున్నారుట. పల్లెలో వున్న తన యిల్లు

అమ్మి పెట్టమంటుంది. ఈ పీడే వదిలించుకోలేక పోతుంటే, ఇంటర్వ్యూకి వెళ్తుంటే నాలుగు రోడ్ల కూడలిలో మా పిన్ని కావుమ్మ వడేసి నా చొక్కా పట్టుకున్నది. గుంజు తూలాగుతూ అంకెలు వేసింది. ''నా కూతుర్ని బెల్లించి భ్రష్టు చేయాలని చూస్తున్నావు. వీల్లేదు. నేనూరుకోను. నేను నోట్లో నాలుక లేని దాన్ని గాను. దాని ఆస్తి లాగాలనీ దత్తు చేయించాలనీ చూస్తున్నావు. దానికి పెళ్లి చేయి చేతనైతే. ఆస్తిపై హక్కు వచ్చింది స్త్రీలకి. ఆస్తి అమ్మి డబ్బు నా పేర ఫిక్సెడ్ డిపాజిట్ వేయి. లేదా నా కొడుకును చదివించు. వాడికి ఐఐటీలో సీటొచ్చింది''.

కొడుకు రమేష్ తల్లి వెనకనే నిలబడి యికిలిస్తూ, '' ఇహిహీ! అప్లికేషన్ తెచ్చేశాను. నువ్వు తలూపంగానే ఫిలప్ చేసి, ఇన్స్టిట్యూట్‌లో యిచ్చి వస్తా యేమంటావ్? ఓకే యేనా?'' అంటున్నాడు.

జనం మూగుతున్నారు.

''చూద్దాం'' అంటుండగా నా క్లాస్‌మేట్ మరియు ఫ్రెండ్ యస్పై వచ్చి సమయానికాదుకున్నాడు. పెట్రోల్ కార్ చూసి జనం పల్చబడ్డారు. కావుమ్మా, కొడుకూ మిర్రి మిర్రి చూసి జారుకున్నారు. ఫ్రెండ్ వాహనంలో నర్సింగ్‌హోమ్ కెళ్లా. మా నాన్న బాత్ రూమ్‌లో కాలుజారిపడితే, బాత్ రూమ్ సరిగా కడగలేదుట, కాలు ఫ్రాక్చరైతే ఎడ్మిట్ చేశాను. బోన్ స్పెషలిస్ట్'' మీ నాన్నకు మధుమేహమున్నది మిస్టర్ జానకీపతీ! అతుక్కోకపోవచ్చు. కాలు తీసేయాల్సిరావచ్చు''. అది విన్న మా నాన్న ఉన్మాదిలాగా అయినాడు.

''నువ్వూ అదీ యీ వూర్నించి వెళ్లిపొండి. యెంత అప్రతిష్ఠ! యెంత అవమానం? ప్రతీ కుంకాకీ నన్ను యెద్దేవా చేసేవాడే? నువే కారణం జానకీపతీ. దాన్ని క్రిష్ణలోకి తోసేయ్. సంతానం గూడానా దానికీ? యెన్ని గుండెలు?'' అని లేవబోతే నర్సెస్ పెట్టుకున్నారు. డాక్టరు యింజెక్షనిచ్చాడు నిద్రబట్టటానికి.

అక్కడనించి వచ్చేస్తుంటే సుభద్రాకుమార్ నా ఫస్ట్ కజిన్ అరెస్టయినాడని

వాళ్ల నాన్న యెదురుగా వచ్చి నా కాళ్లూ గడ్డాలూ పట్టుకున్నాడు.

''లైసెన్సు లేకుండా రైఫిల్‌తో పట్టుబడ్డాడుట. అది నాదిగాదు స్నేహితుడిది. వాడెటో పారిపోయాడు. దీనిని నా చేతులో పెట్టి అంటున్నాడు. అది ప్రయత్నిస్తుండగా కో ఆపరేటివ్ స్టోర్స్‌లో నాలుగు వేలు పోయాయి. వీడు జవాబుదారీ. కీస్ వీడి దగ్గరున్నాయట. వాచ్‌మన్ సాక్ష్యమిచ్చాడు. ఆ డబ్బు చెల్లించాలిట. చేబదులిప్పించమంటాడు. లేదా మా అమ్మగాజులు తాకట్టుపెట్టి తెమ్మంటాడు. అర్జంట్‌ట''.

ఇంటికి పోతే అమ్మేమో దెప్పి పొడుస్తూ ''నీ మూలకంగా తక్కిన పిల్లలు నా కెదురు తిరుగుతున్నారు. మీరిద్దరూ వేరే వూళ్లో యేడవరాదా? వూళ్లేలాలా? చదువుకున్నదన్నారు. వుద్యోగంలో తగలడలేదా? నా వద్ద నించి యేమీ రాలదు. నా కూతుర్ని నే చూసుకోవద్దా? మొదట్నించీ నువ్వు పొరుగింటి పొయిరాయివే. బాగానే వంచించింది నిన్ను. చెబితే విన్నావా? వచ్చిన సంబంధమల్లా తరిమేసి నువ్వు చేసిన నిర్వాకమిదేనా? నన్నేడిపించటానికే పుట్టావు'' అని చేతులు తిప్పి యేడిచి, కళ్లద్దుకున్నది కొంగుతో''. యెలాగైతేనేం నవ్వగలిగి భోజనం పూర్తి చేశాడు జానకీపతి.

చేయి తుడుచుకుంటూ వెళ్లి వీధి తలుపు తీసేప్పటికి తమ్ముడు గణేష్ అదుర్దాగా కనబడుతూ నిలబడి వున్నాడు.

''లోపలికి పోదామా? నేను నక్సల్నని పట్టుకోవాలని వస్తున్నారు. నా భార్యకి ఒంట్లో బాగా లేదు. స్రావమవుతున్నది. ఎబార్షనౌతుందేమో అంటున్నది'' అన్నాడు.

''నర్సింగ్‌హోమ్‌లో చేర్పిద్దాం పద'' అని వెంటబెట్టుకెళ్లాడు తమ్ముడిని.

## 3

అప్పు చేయటం, వడ్డీకి తేవటం సుతరామూ యిష్టంలేని జానకీపతి, తన స్వార్జితంతో తాను ముచ్చటపడి కొనుక్కున్నవి ఒక్కొక్కటే అమ్మసాగాడు.

ఫోల్గిండ్ ఫర్నిచర్, ఫ్రిజ్, డ్రెస్సింగ్ టేబిల్, వాషింగ్ మెషీన్, డిష్ వాషర్, గీసర్, బెడ్స్.

సీత ఆడపిల్లను కని అయిదో రోజు యింటి కొచ్చేసింది. డెలివరీ రూమ్ మార్చురీకి పక్కనే. వాసనా, యేడుపులూ.

సిజేరియన్ ఆపరేషన్ జరిగి చనిపోయిన గృహిణిని మార్చురీలో పెట్టి తాళం వేసింది డాక్టరమ్మ. బంధువులు యేడ్చారు ''యిచ్చేయమ్మా. మొక్కుతాం. అంత్యక్రియలు చేసుకోవాలి. కుళ్లిపోతుంది. యిచ్చేయ్''.

''అన్నిటికీ ఒప్పుకున్నారు. ఒప్పుదల మీదే చేశాను. రాసిచ్చారు. మాటిచ్చారు. డబ్బు తెస్తున్నామన్నారు. రాలేదు. నా తప్పేదీ? బతుకుతుందని మాటివ్వలేదే నేను. బిడ్డ తిరగటం లేదు. పోయిందేమో తీసేయమన్నారు. చాలా లేట్‌గా ప్రాణం మీదకి వచ్చాక తెచ్చారు. అయిదు లేక యేడో నెలలోనే తేవాలి. బేబీ బాగా లేదని మిడ్ వైఫ్ చెప్పిందిట. దాన్నీ దాని మాటల్నీ లెక్కచేయలేదు మీరు. అది అనుభవశాలే. డబ్బు కూడపెట్టి తీసికెళ్లండి'' అని వెళ్లిపోతుంటే కాళ్లమీద పడ్డారు. జనం పోగయినారు. ఒక గడుసుపిండం పోలీసులకు రిపోర్ట్ చేశాడు. దగ్గరే పోలీస్ స్టేషన్. పోలీసులొచ్చారు. కేసు నమోదైంది. ఆ రాత్రికి స్వాధీనమైన శవాన్ని లబోమని యేడుస్తూ ఆత్మీయులు తీసికెళ్లారు.

జనరల్ వార్డ్‌లో బెడ్ మీదుంచారు సీతని. పక్కనే యినప వుయ్యాల. అందులో సీత చీర మీద నూతన శిశువు. మిడ్ వైఫ్ నీళ్లు పోసి తుడిచి, సీత చీర ముక్కకు కన్నం వేసి చొక్కాలాగా తొడిగింది పాపకు. సాయమొచ్చిన తల్లి భూదేవమ్మ రొద పెట్టింది.

'' ఇంటికెళ్లి పోదాం సీతా. డిశ్చార్జ్ చేయమను. అందరూ అంటువ్యాధుల రోగులే యీ వార్డులో'' అని విలవిలలాడింది.

సీత డాక్టరమ్మతో చెప్పుకుని విడుదలై అయిదవ రోజే యింటికి వచ్చేసింది పాపనెత్తుకుని. తల్లిని వెతుక్కుంటూ అక్కా అన్నా వచ్చారు. బంధువులూ వచ్చారు.

'' ఇంతమందికి రెండుపూటలా అన్నీ చేయలేనే సీతా. నీకా చెంబెడు నీళ్లు పోసి పదకొండో రోజు పోతా. చేసుకు తిను. వేడుకలూ లేవు. పుణ్యావచనం వుండదైపాయె''.

అంతా వెళ్లారు. నసా వదిలింది సీతకి. ఖర్చులన్నీ భరించాడు జానకీపతి. నగుమోమే. సంభాళించుకుంటున్నాడు. మంచి దినాలకై యెదురు చూస్తున్నాడు.

ఆక్టింగ్ జాబ్స్ అందితే రాత్రిళ్లు గూడా ఎక్స్ట్రా వర్క్ చేస్తున్నాడు జానకీపతి. పిల్లల్ని బళ్లో దింపి వస్తాడు. ఇంట్లో సీతకి సాయపడతాడు.

చేతులో డబ్బు ఆడగానే మళ్లా మెషీన్లు కొనసాగాడు. మిల్క్ కుక్కర్, గ్రైండర్, యిస్త్రీ చేసే మెషీన్, ఇన్స్టెంట్ ఫుడ్ పొట్లాలు తెచ్చి, వంట సులభం చేశాడు సీతకి. వూపిరి పీల్చుకుని నవ్వుతూ అన్నాడు. ''సీతా! పాపం కష్టపడి కూతుర్ని కన్నావు. బ్రాహ్మడు రావటం, మంత్రాలు చదవటం, పుణ్యావచనం, పేరు పెట్టటం, మొలతాడు కట్టటం యేమీ లేవు. కొత్త చీరా లేదు. కొత్త గౌను లేదు. పోరాటంతో సరిపోతున్నది. సీతా! మంచి ప్రకటన పడితే చూసి అప్లికేషన్ యిచ్చి వచ్చా. కిచెన్‌లో షెల్ఫులో పెట్టి సింపుల్‌గా పూజ చేసుకుంటున్నావు యిలవేల్పుని. నీ పూజలూ, తపమూ ఫలించాలి. మంచి పరిసరాలున్న చోటికి పోదాం. దూరాభారమైనా సరే. ఈ చుట్టుపట్ల వైలెన్సు పెరుగుతున్నది. వైర్లు తెంచుతున్నారు. నీ వంటి మీది బంగారప్పిసరూ నడిచిపోయింది సీతా. బంగారం ధర మన కోసమే పెరిగిపోయింది'' అని దుఃఖం అభినయించాడు. ''నా మీదికెక్కిన నేరం తొలిగింది. నా పేరు క్లియరైంది'' అన్నాడు నవ్వుతూ.

''నాకు మీరు చాలు. బంగార మెందుకూ? బంగారం మనశ్శాంతీ, సుఖమూ యిస్తుందా? మన భవనానికెదురుగా ఆటస్థలం అవతలున్న ఆసామి భవనం పూర్తి చేశాడు. అన్నీ అమ్ముడు పోయాయిట. సంతోషంతో పొంగిపోయాడు. ఆయన భార్య వస్తూ వుంటుంది. తన గోడు వినమంటుంది.

సింఫతీ చూపుతూ వింటాను. జాలివేస్తుంది''.

''భవనం లేవదీయగలిగాడు గానీ మగడు, పిల్ల పెళ్లి మాటెత్తడు. నేను చూపేవీ, వాటంతటవే వచ్చిన సంబంధాలన్నీ తిప్పేస్తున్నాడు సీతమ్మ తల్లీ! కూతురికి తోడుగా వుంటాడల్లుడు, యిద్దరూ జతగా తిరుగుతుంటే చూసి సంతోషించాలనిపించదా? భీమా కంపెనీ వారుద్యోగము యిచ్చారు. మీ చేతి చమురు వదల్లేదే'' అని మొరపెట్టుకుంటే సీతమ్మ తల్లీ! కోడలొచ్చిందిగా కొరివీ, రోజూ రోగమే. రోగిష్ఠి మనిషి. వాడి జీతం పెళ్లాం మందులకీ, డాక్టర్ల ఫీజులకీ, టెస్టులకీ, రిపోర్టులకీ చెల్లు. ఇప్పుడిదో ఫాషనైంది. పెద్దాపరేషను చేయించుకునిగాని కొడుకుని కనదు కోడలు. ఖర్మ! ఆ ఖర్చూ నా కొడుకుదే. పెళ్లి చేశానా కూతురి ఖర్చులూ నావే అవుతాయి. మనమ్మాయికి మనం పెట్టుకోవాలి. ఆ వచ్చే మిడిల్ క్లాస్ అల్లుడికి అన్నీ నేనే చేసిపెట్టాలి. జాబూ చూసిపెట్టాలి. వ్యాపారం పెట్టాడంటే మదుపూ నేనే పెట్టాలి. ఇపుడు ప్రాణం హాయిగా వున్నది నాకూ నా కూతురికీ. జామాతా దశమ గ్రహః అన్నారు'' అని వాగుతూ డాన్సు అభినయం చేస్తాడు మగడు. సీతమ్మ తల్లీ కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది. రెండో కొడుకు గాంధర్వం వెలిగించాడట. మేనకకు యింద్రుడున్నట్టు ఆ అమ్మాయికి యజమాని వున్నాడట. తీరికే లేదుట. సంతు కలగలేదుట. వీడిని లూర్ చేసి ముద్దు చేసిందట. ఖర్మ గాడిద లేలమంటే, గుఱ్ఱం కంచెలో కీడ్చిందట బండిని. దాన్ని వదలలేడు. యెప్పుడో వచ్చి తొంగి చూసిపోతాడు పిచ్చి సన్నాసి. దాని కోరిక తీరిందని సంతోషిస్తాడు'' అని కన్నీళ్లు చీర కొంగుతో తుడుచుకున్నది పిన్ని గారు.

4

సీత పూజలు ఫలించినై. ఆంజనేయుడు రామాంకిత వుంగరమిచ్చినట్లు, జానకీపతికి కాషియర్ వుద్యోగం వచ్చింది చేతులోకి. నాలుగు భాషలు వ్రాయనూ చదవనూ మాట్లాడటమూ వచ్చు. తర్జుమా చేయటం వచ్చు. ఇల్లూ, దీపం, నీళ్లూ

ఫ్రీ. ఫస్ట్‌న వచ్చి జాయిన్ కమ్మని ఆర్డర్సు వచ్చినయ్యి.

వనవాసానంతరం అయోధ్యకు వెళ్తున్న రాముని లాగా అశోక్‌నగర్ పేటకి గుడ్‌బై చెప్పి, భార్యా బిడ్డలతో, బెర్త్ రిజర్వు చేసుకున్న రైలెక్కాడు జానకీపతి.